విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- నర్మాల గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

నర్మాల గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గంభీరావుపేట, అక్టోబర్ 13: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. గంభీరావుపేట మండలం నర్మాల గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో 9వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్-2023 పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి క్రీడాపోటీలను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నర్మాల గురుకుల పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించనున్న క్రీడాపోటీల్లో 13 పాఠశాలల నుంచి 1,105మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల డిప్యూటీ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్‌సీవో మేరీ యేసుపాదం, నర్మాల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల, ఆయా పాఠశాలల అధ్యాపకులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో రేపటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు

విద్యుద్దీప కాంతుల్లో వేములవాడ రాజన్న ఆలయం

వేములవాడ టౌన్, అక్టోబర్ 13: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం నుంచి దేవీశరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఆలయ గోపురాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఆశ్వీయుజ శుద్ధ ప్రతిపద (ఈ నెల 15) నుంచి ఆశ్వీయుజ శుద్ధనవమి ఉపరిదశమి (ఈ నెల 23) వరకు శరన్నవరాత్రోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతాయని చెప్పారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారు విశేష అలంకారాల్లో దర్శనమిస్తారని తెలిపారు.

శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్, అక్టోబర్ 13 : సిరిసిల్ల శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆర్డీవో ఆనంద్‌కుమార్ ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలపై ఆర్డీవో ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవం శ్రీవైష్ణవ పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఆశ్వయుజ బహుళ సప్తమి నుంచి ఆశ్వయుజ బహుళ విదియ వరకు ఈనెల 21 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయడానికి ఆర్డీవో పలు సూచనలు చేశారు. ఈనెల 24న మంగళవారం విజయదశమి (దసరా) ఉత్సవం ఉంటుందన్నారు. 28న శనివారం స్వామివారి రథోత్సవం జాతర వైభవంగా నిర్వహించాలన్నారు. శ్రీస్వామివారి రథోత్సవం రోజున చంద్రగ్రహణం ఉన్నందున ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే భక్తులకు రథంపై స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. అనంతరం పురవీధుల్లో శ్రీస్వామివారు శోభాయాత్రగా బయలుదేరతారన్నారు. సాయంత్రం 5 గంటలకు ఆలయం మూసివేత ఉంటాయని కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆలయ ఈవో డీవీ మారుతీరావు, కమిటీ సభ్యులు ఉప్పుల విఠల్‌రెడ్డి, మేర్గు లక్ష్మణ్, మామిడాల రమణ, కోడం శ్రీనివాస్, అల్లాడి సరస్వతి, కత్తెర సంతోషిణి ఉన్నారు.

గంభీరావుపేట : ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

సిరిసిల్ల రూరల్ :మండేపల్లిలో సరస్వతి విద్యానికేతన్ స్కూల్‌లో బతుకమ్మ సంబురాల్లో విద్యార్థులు

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు

బోయినపల్లి, అక్టోబర్ 13 : బోయినపల్లి ఆనంద్ విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆడారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఇక్కడ కరస్పాండెంటెంట్ బిల్ల ఆనందం, హెచ్ఎం చంద్రమౌళి ఉన్నారు.

గంభీరావుపేట, అక్టోబర్ 13: మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను పాఠశాల ఆవరణలో పెట్టి బతుకమ్మ ఆడారు. విద్యార్థినులు ఉపాధ్యాయునులతో కలిసి నృత్యాలు చేస్తూ పాఠశాలలో సందడి చేశారు.

ముస్తాబాద్, అక్టోబర్ 13 : ముస్తాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మ వేడుకలను పలు పాఠశాల విద్యార్థులు నిర్వహించారు. శ్రీవాణి పాఠశాల నిర్వాహకులు తీరొక్క పూలతో బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లారు. బతుకమ్మ ఆటాపాటలతో అలరించారు.

వేములవాడ టౌన్, అక్టోబర్ 13 : పట్టణంలోని ఉజ్వల, వివేకానంద స్కూళ్లల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు

బోయినపల్లి : ఆనంద్ విద్యానికేతన్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయినులు

రంగురంగుల పూలతో బొడ్డెమ్మ, బతుకమ్మలు తయారు చేసి బతుకమ్మ, కోలాటాలు ఆడారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల స్కూల్ కరస్పాండెంట్ విక్కుర్తి అరుణాద్రి, శాంత, మేనేజింగ్ డైరెక్టర్లు పంజాల వెంకటేశ్వర్లు, వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ గడీల ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 13: తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని సరస్వతి విద్యానికేతన్, సారంపల్లిలో సిద్ధార్థ విద్యానికేతన్ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, పాఠశాలల ఆవరణలో ఆడిపాడారు. కార్యక్రమాల్లో కరస్పాండెంట్లు కొక్కుల శ్రీనివాస్, ఎరవెల్లి రాజనర్సు, విద్యార్థినులు ఉన్నారు.

రసమయికే మా ఓటు

- బీఆర్ఎస్‌కు గొల్లపల్లి గ్రామస్తుల మద్దతు

ఇల్లంతకుంట, అక్టోబర్ 13: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కే మా ఓటు వేసి, బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఉంటామని గొల్లపల్లి గ్రామస్తులు స్పష్టం చేశారు. శుక్రవారం వారు జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు కార్యాలయంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా రసమయిని మూడోరి అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు కృతజ్ఞతలు చెప్పారు. ఇక్కడ సోమారంపేట సర్పంచ్ కాచం శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పత్రి అంజయ్య, బీరయ్య, కనకయ్య, తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మద్దతు తెలుపుతున్న గొల్లపల్లి గ్రామస్తులను అభినందిస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రపుల్ దేశాయ్

గంగాధర, అక్టోబర్ 13: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని చొప్పదండి రిటర్నింగ్ అధికారి ప్రపుల్ దేశాయ్ సూచించారు. శుక్రవారం ఆయన గంగాధర మండలం మధురానగర్‌లో మోడల్‌కోడ్, ఎన్నికల నిర్వహణపై చొప్పదండి నియోజకవర్గ స్థాయిలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో రాజకీయ పార్టీలు, నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు, గోడపై రాతలు, వాల్‌పోస్టర్లు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే సీజ్ చేసి, కలెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అప్పగించాలని సూచించారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి వసతి సౌకర్యాలను మండల కేంద్రంలోని కార్యాలయాన్ని పరిశీలించారు. ఇక్కడ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, నియోజకవర్గంలోని ఆరు మండలాల సీఐలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, ఎస్‌లు, సెక్టార్ అధికారులు, ఎఫ్ఎస్‌టీలు, ఎస్ఎస్‌టీలు, వీఎస్‌టీలు, ఎంసీసీలు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ఎన్నికల సిబ్బంది కోసం వసతి సౌకర్యాలను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రపుల్ దేశాయ్

బాధిత కుటుంబాలకు సాయం

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 13: సింగారానికి చెందిన మద్దూరి బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ పక్షాన తక్షణ సాయంగా రూ.5 వేలు అందించారు. అలాగే బొప్పాపూర్‌కు చెందిన గుగ్గిల్ల నర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా సదరు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఇక్కడ సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కొండాపురం బాల్‌రెడ్డి, ల్యాగల సతీశ్‌రెడ్డి, ముత్యాల చంద్రారెడ్డి, అంబటి నర్సయ్య, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపల్లి సురేశ్, సింగారం దేవరాజు, వాసరవేని రాజు, నాగరాజు, రవీందర్, దేవయ్య, మల్లేశ్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

గంభీరావుపేట, అక్టోబర్ 13: గూడు లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇండ్ల నిర్మాణం చేపట్టిందని, అలాంటి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని 272 ఇండ్లు నిర్మించి, అర్హులకు అందించాలన్న ఉద్దేశ్యంతో పైరవీలకు తావు లేకుండా ఆరుసార్లు గ్రామ సభలు పెట్టి 206 మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. ఈ క్రమంలో గత నెల 28న తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అధికారులు అందించారని వారు తెలిపారు. అనర్హులకు ఇండ్లు మంజూరు చేశారని కొందరు ఆరోపణలు చేస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకవస్తున్నారని సర్పంచ్ ఆరోపించారు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసి పంపించానన్నారు. పేదలను తప్పుదోవ పట్టించిన వారిని గుర్తించి శిక్షించాలని కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు.

ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయండి

వేములవాడ రూరల్, అక్టోబర్ 13 : ఈనెల 17న సిరిసిల్లలో జరిగే బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని వేములవాడ జడ్పీటీసీ మ్యాకల రవి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన అనుపురంలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రదాత, సీఎం కేసీఆర్ సిరిసిల్ల జిల్లాకు రావడం మనందరి అదృష్టమన్నారు. వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్లాలన్నారు. ఇంటికి ఒకరు సభకు వచ్చేలా ప్రతి కార్యకర్తా కృషి చేయాలన్నారు. వేములవాడ మండలం నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 17 మందికి ఒకరోజు జైలు

వేములవాడ రూరల్, అక్టోబర్ 13 : వేములవాడ టౌన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారికి వేములవాడ కోర్టు జడ్జి ఒకరోజు జైలు శిక్షను అమలు చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలను నడుపవద్దని, పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పట్టుబడ్డ 17 మందికి ఒకరోజు జైలు శిక్షను విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని తెలిపారు.

వేములవాడ రూరల్ పరిధిలో 11 మందికి

వేములవాడ రూరల్ పరిధిలో మద్యం తాగి వాహనాలను నడిపిన 11 మందికి ఒకరోజు జైలు శిక్ష, రూ.500 జరిమానాను జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు వేములవాడ జడ్జి ప్రవీణ్ విధించినట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలను నడుపి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.